క్లుప్తంగా

క్రీడాకారుడు లోహిత్‌కు కలెక్టర్ అభినందన



క్రీడాకారుడు లోహిత్‌ను అభినందిస్తున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

డుంబ్రిగుడ: ఇటీవల రాజమండ్రి, గుంటూరులో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన శెట్టి లోహిత్ తన కుటుంబ సభ్యులతో మంగళవారం కలెక్టర్ దినేష్‌కుమార్ కలిశారు. అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన క్రీడాకారుడు లోహిత్‌ను ఆయన అభినందించారు. డిసెంబర్‌లో భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని లోహిత్ తల్లిదండ్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ తెడబరికి సురేష్‌కుమార్, లోహిత్ తండ్రి సంజీవ్, రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీలు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ డేను పురస్కరించుకుని మంగళవారం పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిపై కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు పోస్టర్లు తయారు చేసి ప్రతిభకనబరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, అధ్యాపకులు సుందరీ రాణి, లచ్చన్న, పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో స్పీకర్ల ఏర్పాటు

పాడేరు : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయంలో స్పీకర్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు మంగళవారం ఆలయ పరిసర ప్రాంతాల్లో సుమారు 500 మీటర్ల మేర ప్రత్యేక సౌండ్ బాక్స్‌లను అమర్చారు. ఇకపై ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అమ్మవారి శ్లోకాలు, సంకీర్తనలు, భక్తి గీతాలు భక్తులకు వినిపిస్తాయని కోటిబాబు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఏకలవ్య పాఠశాల విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెదబయలు: వచ్చే నెలలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పెదబయలు ఏకలవ్య పాఠశాల విద్యార్థులు బుజ్జిబాబు, చందు, మమత్ ఎంపికయ్యారని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ అనింత్‌కుమార్ ఆనంద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాలలో ఆయన అభినందించారు. వాలీబాల్, హైజంప్, ఖోఖో పోటీలలో 4 బంగారు పతకాలు, 10 వెండి పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించి విద్యార్థులతో పాటు అక్టోబర్‌లో అరకులో జరిగిన 5వ ఏకలవ్య ఫెస్ట్‌లో వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలోను ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకోవాలని కోరారు.

అంతర్ జిల్లాల అథ్లెటిక్స్‌లో మెరిసిన విద్యార్థులు

అరకులోయటౌన్: విశాఖలోని ఏయూలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరిగిన అంతర్ జిల్లాల డిగ్రీ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 4-100 మీటర్ల పరుగు పందెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సాయి శ్రీనివాస్, మధుబాబు, గోపాలకృష్ణ, పవన్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచారు. 100 మీటర్ల పరుగుపందంలో పవన్ కుమార్ రెండో స్థానం, 400, 200 మీటర్ల పరుగు పందెంలో ఎస్.లోహిత్ ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో పవన్‌కుమార్ తృతీయ స్థానం, లాంగ్ జంప్‌లో గోపాల కృష్ణ ప్రథమ, శ్రీనివాస్ ద్వితీయ స్థానం, ట్రిపుల్ జంప్‌లో గోపాలకృష్ణ ప్రథమ, జావలిన్ త్రోలో ఎస్.అప్పలరాజు ప్రథమ స్థానం, హైజంప్‌లో సురేష్ తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్ తెలిపారు.

- ఏయూలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పట్నాసి చలపతిరావు తెలిపారు. జావలిన్ త్రోలో జ్యోతిక ద్వితీయ, రాఘవి తృతీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.



గిరిజన రైతులకు సలహాలు ఇస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు



సొవ్వా ప్రాంతంలో సాగులో ఉన్న వంగ పంట

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- రబీ సీజన్‌లో ఆశాజనకంగా పంటలు
- సాగుపై గిరిజన రైతుల ఆసక్తి

పంట	సాగు (ఎకరాల్లో..)
క్యాబేజీ	500
టమాటా	300
మిరప	150
వంకాయ	450
ముల్లంగి	200

డుంబ్రిగుడ: గిరిజన రైతులు సాధారణ వ్యవసాయ పంటలతో పాటు కూరగాయల సాగుపై ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలోని సొవ్వా, గసభ, అరమ, పోతంగి, కంద్రుమ్, కొల్లాపుట్టు, తదితర పంచాయతీల్లో అధిక సంఖ్యలో పండించి లాభాలు ఆర్జిస్తున్నారు. టమాటా, మిరప, వంకాయ, క్యాబేజీ, తదితర కూరగాయ పంటలను సాగు చేస్తూ సమీప వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తినప్పుడు సమీప గెడ్డల నుంచి, కొండ వాగుల నుంచి వచ్చే నీటిని గ్రావిటీ పథకంలో ఒడిసి పట్టుకొని గరువులు, పొలాలకు మళ్లించి కూరగాయల పంటలను పండిస్తున్నారు. ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడంతో ఎక్కువ మంది గిరిజన రైతులు కూరగాయల సాగుపై మరింత మక్కువ చూపారు. ఈ ఏడాది నడిమివలసకు చెందిన ఓ గిరిజన రైతు తన 1.5 ఎకరాల్లో క్యాబేజీ పంట వేయగా.. కేవలం పావు ఎకరా పంటను 1.5 లక్షలకు విక్రయించాడంటే లాభాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఉద్యానవన శాఖ అధికారులు కూడా కూరగాయల సాగుపై పలు సూచనలు, సలహాలు చేస్తుండడం గిరిజన రైతులకు కలిసి వస్తోంది.



పురుగు మందు పిచికారీ చేస్తున్న గిరిజన రైతులు

కూరగాయల సాగు బాగుంది..



ఈ ఏడాది కూరగాయల సాగుతో లాభాలు పొందుతున్నాం. బస్తా క్యాబేజీ రూ.1000, కావిడీ రూ.2000 చొప్పున గ్రామాల వద్దకు వచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఎటువంటి దళారీల బారిన పడకుండా ముందుగా భజాన ఇచ్చి పండిన అనంతరం పంటలను తీసుకెళ్తున్నారు.

– పాంగి దనుర్జయ్, రైతు, అరమ పంచాయతీ, నందివలస గ్రామం

క్యాబేజీతో లాభాలు



ఈ ఏడాది 1.5 ఎకరాల్లో క్యాబేజీ పంట వేశాను. ఈ వారంలో కేవలం పావు ఎకరాలో పంటను 1.50 లక్షలకు విక్రయించాను. మరో ఎకరం క్యాబేజి పంట కాపు ఉంది. ఎకరంన్నరకు సుమారు రూ.50 వేలు మాత్రమే పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం కూరగాయల ధరలు పెరుగుతుండడంతో మా కష్టానికి తగిన ఫలితం వస్తుంది. మరో ఎకరంలో పంటను సుమారు రూ.3లక్షల వరకు అమ్మకానికి సిద్ధంగా ఉంది.

– వంతాల శ్రీరామమూర్తి, గిరిజన రైతు, నందివలస గ్రామం

విత్తనాల ఎంపిక ప్రధానం



రైతులు నాసిరకం విత్తనాలు వాడకుండా మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. అటువంటివి వాడితే మంచి దిగుబడి వస్తుంది. ప్రతి పంచాయతీలలో పర్యటిస్తూ రైతులకు పలు సూచనలు, సలహాలు చేస్తున్నాం. సొవ్వా, అరమ, లైగండ పంచాయతీలలో కూరగాయల సాగు బాగుంది.

– కె. శిరీష, ఉద్యానవనశాఖ అధికారి, డుంబ్రిగుడ మండలం

రూ.50 లక్షలతో శ్మశానవాటికల ప్రహరీల నిర్మాణం



హిందూ శ్మశానవాటికను పరిశీలించి వస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, వర్తక సంఘం ప్రతినిధులు

అరకులోయటౌన్: అరకులోయలోని హిందూ, క్రిస్టియన్, ముస్లింల శ్మశానవాటికల వద్ద ప్రహరీల నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరైనట్టు అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. మంగళవారం వర్తక సంఘం ప్రతినిధులతో కలిసి హిందూ శ్మశానవాటికను ఆయన పరిశీలించారు. కొంత కాలంగా శ్మశానవాటిక ఆక్రమణకు గురవుతుందని వర్తకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే.. పీఆర్ డీఈఈ, డ్వామా పీడీలతో ఫోన్‌లో మాట్లాడారు. అరకులోయలోని శ్మశానవాటికలు కబ్జాకు గురవుతున్నాయని, వెంటనే ప్రహరీలు నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు కాపుగంటి కృష్ణారావు, రాంబాబు, శ్రీనివాసరావు, చందూ, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, పార్టీ నాయకులు అశోక్, చిన్నారావు, విజయ్‌కుమార్, లక్ష్మణ్‌కుమార్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన, పారిశుధ్య కార్మికుల ఆందోళన



ముంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న కార్మికులు, నేతలు

ముంచంగిపుట్టు: మధ్యాహ్న భోజన, పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. స్థానిక కల్యాణ మండపం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో శ్రీసాయి హర్షకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, మధ్యాహ్న భోజన పథకం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొంబురు, మంగ్లన్న, సీఐటీయూ మండల నేత గాసిరాందొర, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభను విజయవంతం చేయాలి



గుంటసీమ వారపు సంతలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

డుంబ్రిగుడ: సీపీఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గుంటసీమ వారపు సంతలో ప్రచారం చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు మాట్లాడుతూ మహాసభలో ముఖ్యంగా గిరిజన చట్టాలు, గిరిజన హక్కులు, నిరుద్యోగం, యువతకు ఉపాధి తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. అందరికీ అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, అర్హులైన గిరిజనులకు కొండపోడు పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణాలకు ఇస్తున్న రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దొంబు, శ్రీను, గిరిజనులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రేపు

అడ్డతీగల: ఈ నెల 28న అడ్డతీగల సబ్‌స్టేషన్ వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో రంపచోడవరం రూరల్ డీఈ గాబ్రియేల్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ కార్యక్రమంలో తమ సమస్యలు విన్నవించి పరిష్కారం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎం.ముసల్‌మణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్, తదితరులు పాల్గొంటారన్నారు.

గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరం



జి.మాడుగుల సంతబయలు వారపు సంతలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీఐ సన్యాసినాయుడు

జి.మాడుగుల: గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, ప్రజలు వాటికి దూరంగా ఉండాలని పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ సన్యాసినాయుడు అన్నారు. మండలంలో సంతబయలులో మంగళవారం జరిగిన వారపు సంతలో జీపు, ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. గంజాయితో ఎవరైనా ఆటోలు, జీపులు ఎక్కితే డ్రైవర్లు తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. లేదంటే కేసుల్లో ఇరుక్కుంటారని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డతీగల: గంజాయి రవాణా, సాగు వల్ల కలిగే నష్టాలపై మండలంలోని కోనలోవలో ప్రజలకు అడ్డతీగల ఎస్ఐ వినోద్ అవగాహన కల్పించారు. గంజాయి నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.

హుకుంపేట: మండలంలో గంజాయి సాగు నివారణే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డా, పాములాయి గ్రామాల కొండల్లో గతంలో గంజాయి సాగు చేసిన ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పోలీసులు జల్లెడ పట్టారు. గ్రామాల్లో గంజాయి సాగు, రవాణకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగిని పరీక్షిస్తున్న డాక్టరు బి.లక్ష్మణరావు

సీలేరు: జి.కె.వీధి మండలం సీలేరులో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఏపీజెన్‌కో ఫోర్‌మెన్ నానాజీ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా ఆనందపురం రాయల్ హాస్పిటల్ సహకారంతో స్థానిక జెన్‌కో కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని జెన్‌కో ఈఈ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐ రవీంద్ర, సర్పంచ్ దుర్జో, ఎంపీటీసీ సాంబమూర్తి ప్రారంభించారు. ఆస్పత్రి ఎండీ, ఆర్థో, న్యూరో స్పెషలిస్టు లక్ష్మణరావు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సీలేరు, దారకొండ, గుమ్మిరేవుల పంచాయతీలకు చెందిన సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేశారు.

రాజ్యాంగంతోనే సమానత్వం

- రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



చింతపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

రంపచోడవరం: దేశ ప్రజలంతా సమానమేనని రాజ్యాంగం ద్వారా చాటి చెప్పిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి పీవో సింహాచలం, సబ్ డివిజన్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం రాజ్యాంగం రిజర్వేషన్ల సౌకర్యం కల్పించిందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌వో కె.చిట్టిబాబు, పీఏవో రాంబాబు, తహసీల్దార్లు రామకృష్ణ, బాలాజీ, ఎంపీడీవోలు శ్రీనివాసరావు, విశ్వనాథ్, ఫారెస్ట్ రేంజ్ అధికారి అనూష, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయటౌన్: రాజ్యాంగ దినోత్సవాన్ని అరకులోయలోని పెదలబుడు సచివాలయంలో సర్పంచ్ దాసుబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కులాలు, మతాలకు అతీతంగా రచించిన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అనంతరం అంబేడ్కర్, గాంధీజీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీపీవో బి.లవరాజు, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియారి దొన్నుదొర, ఎంపీడీవో అడపా లవరాజు, ఎంపీటీసీ ఆనంద్ కుమార్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నాయకుడు కమిడి అశోక్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక ఐటీడీఏలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాజ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంతో ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం పొందగలుగుతున్నామని తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు వెంకట్రావు, నాగేశ్వరరావు, శకుంతల, హారతి, శైలజ, శ్రీదేవి పాల్గొన్నారు.



చింతూరు ఐటీడీఏలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రాజ్‌కుమార్



మర్రిపాలెం కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కూనవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.ఆర్.విజయ, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కార్యాలయంలో సబ్ డీఎఫ్‌వో కె.వి.ఎస్.రాఘవరావు, ఎఫ్ఆర్వో కరుణాకర్, వివిధ పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన కూడళ్లలో అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజ్యాంగ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. బాలుర పాఠశాల-1 నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి మానహారంగా ఏర్పడారు. అనంతరం స్థానిక పార్కు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 23 పంచాయతీల్లో పలు పాఠశాలలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీసాయిహర్ష, ఏపీవో సంఘంనాయుడు, హెచ్ఎం మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లిలోని బోదులూరు సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొర్లె అనిల్ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వానవాసీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గొర్లె అనిదీప్ కుమార్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దూడ సువర్ణ కుమార్, వార్డు మెంబర్ నల్లమిలిల సుబ్బారెడ్డి, యూత్ సభ్యులు లచ్చిరెడ్డి, మణికంఠ, రామిరెడ్డి, ప్రసన్న పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీవో శ్రీనివాసరావు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏడీఆర్ ఆళ్ల అప్పలస్వామి, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భారతి ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీవో శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ బాల కిషోర్, పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో 75 రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంజీఎస్ఆర్‌ఈజీఎస్ ఏపీవో సూరిబాబు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు ప్రతిజ్ఞ చేశారు.

గంగవరం : మండలం వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో గంగవరం అమృత సరోవర్ చెరువు వద్ద ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగంలోని హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో ప్రకాశ్ పాల్గొన్నారు.

కొయ్యూరు: మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్ర పటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.వెంకటరమణ, మంగమ్మ, బి.కుమారి, ఎం.శ్రీవిద్య, డి.రాజుబాబు, ఎం.పుష్ప, డి.శ్రీనివాసరావు, బి.శేఖర్, సౌమిత్రి, ప్రసాద్ పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెదలబుడు సచివాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, తదితరులు



డుంబ్రిగుడ ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, తదితరులు



మారేడుమిల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గంగవరంలో ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

అరకులో ఉత్సాహంగా ర్యాలీ

అరకులోయటౌన్: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు రాజ్యాంగ దినోత్సవ ర్యాలీని అరకులోయ పట్టణంలో నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, అధ్యాపకులు నాగబాబు, వై.విజయలక్ష్మి, అనితకుమారి, సుందరిరాణి, తదితరులు పాల్గొన్నారు.



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో శివలింగం ప్రతిష్ట



శివలింగాన్ని ప్రతిష్టిస్తున్న సాయిరాం స్వామీజీ

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలోని ఉపాలయంలో మంగళవారం శివలింగ ప్రతిష్ట వైభవంగా జరిగింది. భీమిలికి చెందిన సద్గురు సేవాశ్రమం సాయిరాం స్వామీజీ బహూకరించిన ఈ శివలింగాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన వేద పండితులు భమిడిపాటి జ్యోతి స్వరూప్ శర్మ వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అప్పలరాజుపేటలో కూడా 9 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

మహా నిరసన ప్రదర్శన



రంపచోడవరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న రైతు, కూలీ సంఘం, గిరిజన సంఘ నాయకులు

రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం రంపచోడవరంలో రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మహా నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేడ్కర్ బొమ్మ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి సబ్ కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నాకు దిగారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాటి బుల్లబ్బాయి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదన్నారు. నిర్వాసితులకు నష్టపరిహారం, భూమికి భూమి, డీ పట్టాలకు పరిహారం, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.